క్లుప్తంగా

'స్పందన'కు 20 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్ కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తులు సమర్పించారు. కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో బండరాళ్లు



సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో బండరాళ్లు

సీతమ్మధార: స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డు మధ్యలో బండరాళ్లు వేయడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా బండ రాళ్లను అక్కడే వదిలేయడంతో రాత్రి పూట యూటర్న్ తీసుకునే సమయంలో ద్విచక్ర వాహన చోదకులు, కార్లు నడిపే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తొలగింపు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూలిన పోర్ట్ క్వార్టర్స్ ప్రహరీ



పోర్ట్ వాటర్ ట్యాంక్స్ ఎదురుగా కూలిన గోడ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాల గ్రామపురంలోని పోర్ట్ క్వార్టర్స్ చుట్టూ నిర్మించిన ప్రహరీ వర్షాలకు కూలిపోయింది. సాల గ్రామపురం పోర్ట్ వాటర్ ట్యాంక్ ఎదురుగా డ్రైనేజీ, గెడ్డ నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. వీటి కారణంగా గోడను ఆనుకుని తవ్వకాలు జరిపారు. పనులు కొనసాగుతుండగా వర్షాలు కురవడంతో ఆదివారం రాత్రి సమయంలో ఈ గోడ కూలిపోయింది. దీంతో పైప్‌లైన్ కూడా పగిలిపోయి చాలా తాగునీరు వృథాగా పోయింది. వెంటనే గుర్తించిన పోర్ట్ వాటర్ ట్యాంక్స్ సిబ్బంది సంబంధిత లైన్‌లను ఆపివేసి, నీటి వృథాను అరికట్టారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

నేడు ఎడ్యుకేషన్ ఫెయిర్

అల్లిపురం: విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారికి యూని ఎక్స్‌పర్ట్స్ సంస్థ అవకాశం కల్పిస్తుందని ఆ సంస్థ వైజాగ్ బ్రాంచ్ మేనేజర్ అనిత కొమ్మరాజు తెలిపారు. నగరంలోని ఫార్చ్యూన్ శ్రీకన్య హోటల్‌లో మంగళవారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 77859 68968 నంబర్లో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ 'జగనన్న సురక్ష'



53వ వార్డులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీ



50వ వార్డులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 53, 50 వార్డుల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత

మద్దిపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 53, 50 వార్డుల్లో కార్పొరేటర్లు బర్కత్ అలీ, వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు.

53వ వార్డులో 1,299 మందికి..

ముందుగా 53వ వార్డు నరేంద్రనగర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.కె.రాజు మాట్లాడుతూ అర్హులందరూ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లను అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారన్నారు. దీని ద్వారా పేదలకు న్యాయం చేకూరుతుందన్నారు. 11 రకాల పౌర సేవలను, ధ్రువపత్రాలను నేరుగా.. ఉచితంగా లబ్ధిదారులందరికీ అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం వార్డులో 1,299 మందికి కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి కె.కె.రాజు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, ఏపీడీ పద్మావతి, ఈఈ శ్రీనివాస్, ఏఈ అర్చన, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు షేక్ బాబ్జి, భాస్కర్, హనుమంతు, నబీ, సుశీల, ఝాన్సీ, సంపత్, అలీ, సుజాత, భాను, లోక్‌నాథ్ పాత్రో, జయ, లక్ష్మి, చాందిని, గిరీష్, సత్యవేణి, బాలాజీ, చిన్న, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

50వ వార్డులో 1,009 మందికి..

వార్డులోని మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌ను కె.కె.రాజు ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని, తద్వారా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా సేవలందిస్తోందని చెప్పారు. అనంతరం వార్డులో 1,009 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి కె.కె.రాజు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, ఈఈ శ్రీనివాస్, ఏఈ అర్చన, సీనియర్ నాయకులు భరణికాన రామారావు, పార్టీ 50వ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, డైరెక్టర్లు దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భగాతి విజయ్‌కుమార్, కృష్ణారావు మాస్టర్, రాజంరాజు, ఏవీఎస్ రాజు, సబ్బవరపు శ్రీను, పొన్నాడ అప్పారావు మాస్టర్, ఎం.లక్ష్మి, పి.రామ్మోహన్, సీపాన రాము, సరస్వతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చేతికే ధ్రువపత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మూడు రోజుల్లో నేరుగా చేతికే కుల, ఆదాయ ధ్రువపత్రాలను అందించారు. గతంలో వీటి కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– జి.రాజేశ్వరి, శివనగర్, 53వ వార్డు

మూడు రోజుల్లోనే..



మూడు రోజుల్లోనే నా చేతికి క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు చేతికి వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా ఈ కార్యక్రమం ఉంది. వలంటీర్లు పూర్తిగా వివరించి దరఖాస్తు చేయించారు.

– కె.ఉమ, శివనగర్, 53వ వార్డు

మంచి కార్యక్రమం



జగనన్న సురక్ష మంచి కార్యక్రమం. నాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాను అందించారు. వలంటీర్లు, గృహసారథులు ముందుగానే మా ఇంటికొచ్చి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

– కె.సత్యవతి, మాధవధార, 50వ వార్డు

గొప్ప అవకాశం



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గొప్ప అవకాశం కల్పించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా వస్తాయో రావో తెలియని పరిస్థితి. ఈ క్యాంప్ ద్వారా మూడు రోజుల్లోనే క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు వచ్చాయి.

– సనపల అరుణజ్యోతి, మాధవధార, 50వ వార్డు

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దత్తి అప్పలనాయుడు, పాఠకులు

మురళీనగర్: పుస్తక పఠనానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ ఉద్యమకారుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర సమరయోధుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ స్థాపనకు అయ్యంకి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. విద్యార్థులు ప్రతి రోజు లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షలకు చదువుకునేందుకు అవసరమైన మెటీరియల్ గ్రంథాలయాల్లో లభ్యమవుతుందని చెప్పారు. పైసా ఖర్చు లేకుండా అన్ని రంగాలకు చెందిన గ్రంథాలు, పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయన్నారు. డిజిటల్ పుస్తకాల కన్నా గ్రంథాలయాల్లో భౌతికంగా లభించే పుస్తకాలు చదవడం మంచిదని సూచించారు. విద్యార్థులతో పద్య పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.పద్మజ, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

3న జోన్–3లో బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఆగస్ట్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆశీలుమెట్ట జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ దొండపర్తి కల్యాణ మండపం, డైమండ్ పార్కు వాణిజ్య సముదాయంలోని మొదటి అంతస్తులో గల దుకాణాల నంబర్లు 8, 9, ఆశీలుమెట్ట వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3, ఎంవీపీ వాణిజ్య సముదాయంలోని 7, 10, 13, 14 నంబరు దుకాణాలు, జగ్గారావు బ్రిడ్జి వద్ద వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబరు 6(పీహెచ్ కోటా), సీతమ్మధార పాత వాణిజ్య సముదాయంలోని 15 నంబర్ దుకాణం(ఎస్సీ)కు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంలో పాల్గొనాలని జెడ్సీ కోరారు. వివరాలకు జీవీఎంసీ జోన్–3 కార్యాలయ పనివేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని చెప్పారు.

దయా స్వరూపిణి లలితాదేవి



ప్రవచిస్తున్న రమ్యానంద భారతీ మాతాజీ

సీతంపేట: జగన్మాత, దయా స్వరూపిణి అయిన లలితాదేవి ఎంతో శక్తి కలదని శ్రీ శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ మాతాజీ అన్నారు. లలితాపీఠంలో వారం రోజుల పాటు జరగనున్న లలితాలహరి ప్రవచనాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు జగన్మాత అయిన లలితాదేవి మహత్యం, ఉపాసన విధానం, మంత్ర రహస్యం, సహస్ర నామ పారాయణ పుట్టుక, విశిష్టత, శక్తి, అందులో దాగి ఉన్న మంత్ర రహస్యం, సత్ఫలితాలను భక్తులకు వివరించారు. అమ్మవారి సన్నిధిలో, చాతుర్మాస దీక్షలో ఉన్న జగద్గురువు సమక్షంలో లలితా సహస్ర నామ పారాయణ చేయడం వల్ల అమ్మ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుందన్నారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా భక్తులంతా అమ్మవారికి కుంకుమ పూజ, సహస్ర నామ పారాయణ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

కొమ్మాది: రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ ఛాలెంజర్స్ అండ్ టెండర్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 5 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటరావు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నేడు



చల్లపల్లి శ్రావణి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రవాస భారతీయురాలు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలిపారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో స్థిరపడిన శ్రావణి చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారన్నారు. డీసీఎంఎస్ విభాగంలో ఉదయం 11 నుంచి రెండు గంటల పాటు శ్రావణి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. నృత్య కళాకారిణి శ్రావణి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఏయూలో నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. గణేష పంచరత్నం, కామాక్షి స్తుతి, బ్రహ్మకడిగిన పాదం, శివతాండవ స్తోత్రం, జావళి ప్రదర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య సి.ఎస్.రావు, విజయవేణి, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాల తో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు పలు రకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు.

వైభవంగా బంగారమ్మ తొలేళ్ల ఉత్సవం



వీధిలో పూలజంగడి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల పండగ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వీధుల్లో పూలఘటాలు తిరిగాయి. సాయంత్రం బంగారమ్మకు సారె సమర్పించారు. రాత్రి 7 గంటలకు వీధుల్లో కూటి ఘటాలు తిప్పారు. కళావేదిక ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన పండగ, అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పూలఘటాలు, కూటిఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. అనుపు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ప్రభల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.

ముంచెత్తిన వాన



శంకరమఠం రోడ్డులో కురుస్తున్న వర్షం

సీతంపేట: నగరాన్ని వాన ముంచెత్తింది. పగలంతా ఎండ, సాయంత్రమైతే మేఘాలు కమ్ముకుని వర్షం కురుస్తోంది. ఆదివారం సాయంత్రం లాగే సోమవారం కూడా అదే సమయానికి భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. వివిధ పనులపై బయటకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వ్యాపారాలకు ఇబ్బంది కలగడంతో సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో చిరువ్యాపారులు ఉసూరుమన్నారు. సాయంత్రం విధుల నుంచి ఇళ్లకు చేరుకునే ఉద్యోగులు, స్కూళ్ల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు, వాహన చోదకులు, పాదచారులు వర్షంతో ఇబ్బందులకు గురయ్యారు.

రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు



కూలిన గోడను పరిశీలిస్తున్న కె.కె.రాజు

మద్దిపాలెం: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో జీవీఎంసీ 53వ వార్డు నరేంద్రనగర్ వద్ద గల పౌర సరఫరాల శాఖ గొడౌన్‌కు సంబంధించిన రక్షణ గోడ సోమవారం కూలిపోయింది. దానికి ఆనుకుని నిలిపి ఉన్న ఒక ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం కావడంతోపాటు అక్కడ సమీపంలో ఉన్న కారు వెనుకభాగం పాక్షికంగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణం



గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లో రూ.36 లక్షలతో నిర్మిస్తున్న అదనపు అంతస్తు పనులను సోమవారం స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పరిశీలించారు. పాఠశాలకు క్లాస్ రూంల కొరత తీరేలా ఐదు తరగతి గదుల నిర్మాణం కోసం జీవీఎంసీ మంజూరు చేసిన నిధులతో పనులు జోరుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను, జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్కూల్ హెచ్ఎంలు శాంతికుమారి, బి.దేముడుబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, కాంట్రాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 అర్జీలు అందాయి. ప్రజల వాటిని జెడ్సీ స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్వో ఏపీడీలు చిరంజీవి, పద్మావతి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్ తదితరులు

ఏయూ క్యాంపస్: సంస్థలో వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకంగా నిలుస్తాయని డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్(హెచ్ఆర్) కె.ఎస్.వరప్రసాద్ అన్నారు. సోమవారం ఐఐఎం విశాఖపట్నం ఏయూ ప్రాంగణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు 'ప్రాజెక్ట్ అన్ సెర్టెనిటీ–రిస్క్ మేనేజ్‌మెంట్ అంశంపై' ఐదు రోజుల పాటు జరిగే సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాజెక్టుల నిర్వహణ, పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. విభిన్న సంస్థలు, విభాగాలతో అనుసంధానంగా పని చేయడం, మానవ వనరుల సమర్థ నిర్వహణను వివరించారు. భవిష్యత్తులో ఆటోమేషన్ ఏఐ సాంకేతికతలు ప్రముఖ భూమిక పోషిస్తాయని, సాంకేతికత విస్తృతిని ముున్ముందుగా అంచనా వేస్తూ సాగాలన్నారు. అదే విధంగా ఎన్ఏడీకి చెందిన ఐఏఎస్ఏఎస్ అధికారులకు ఆరు రోజుల ఇండక్షన్ ప్రోగ్రాంని ప్రారంభించారు. ఆచార్య బి.శ్రీరంగాచార్యులు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రోహిత్ తిత్యాల్, ఆచార్య బాలాజి సుబ్రహ్మణియన్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలి



ర్యాలీ చేస్తున్న పలు సంఘాల నాయకులు

సీతమ్మధార: మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల నుంచి ఎల్ఐసీ భవనం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ హింసాకాండపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప, ప్రధాని మోదీ మౌనం వీడకపోవడంపై అనుమానాలు వస్తున్నాయన్నారు. నేరస్తులను శిక్షించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పేంత వరకు వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ఎ.విమల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, శేఖర్, సింహాచలం, ఎం.ఎ.బేగం, పద్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మారణకాండ ఆపాలి

మహారాణిపేట: మణిపూర్ ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలు, హింసాకాండకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్(ఐడీజేఎన్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి పంపే నిమిత్తం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ మాట్లాడుతూ దేశం మొత్తం తలదించుకునే విధంగా మణిపూర్‌లోని కుకీ తెగ ఆదివాసీ మహిళలపై లైంగిక అత్యాచారాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సత్యనారాయణ, కె .చంద్రమోహన్, టి.బంటయ్య, కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.